క్లుప్తంగా

సందడిగా వేసవి శిక్షణ తరగతులు



గ్రంథాలయంలో సరదాగా క్యారమ్ ఆడుతున్న విద్యార్థులు

డెంకాడ: శాఖా గ్రంథాలయంలో గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సందడిగా కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రంథాలయానికి విచ్చేసిన బాలలతో రకరకాల కథల పుస్తకాలు చదివించడంతో పాటు క్యారమ్‌బోర్డు, లూడో స్నేక్ అండ్ లేటర్ వంటి ఆటలను లైబ్రేరియన్ మహేష్ ఆడించారు. విజ్ఞానం, వినోదం అందించే ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న సర్పంచ్ రఘు

పూసపాటిరేగ: మండలంలోని కిలుగుపేటలో కొత్తగా నిర్మిస్తున్న రామమందిరం నిర్మాణానికి కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు రూ.30 వేలు విరాళంగా ఆదివారం అందజేశారు. దైవ కార్యక్రమానికి సేవ చేసే భాగ్యం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని, రాముల వారి కరుణాకటాక్షాలు గ్రామస్తులు ఎల్లప్పుడూ ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ, సతివాడ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొడ్డపేట, ఒమ్మి, బొప్పడాం, వల్లూరు, మల్యా డ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. అలాగే కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నబూరాడపేట, పారసాం, గెద్దపేట.. గుర్ల మండలంలోని నడు పూరు, భూపాళపురం, ఆనందపురం గ్రామాలకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ అరెస్టులు సరికాదు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా చేపడుతున్న అక్రమ అరెస్టులు సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆదివారం ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుంచి దళిత ప్రజాప్రతినిధులు, అధికారులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. మాజీ ఎంపీ నందిగాం సురేష్ ఇంటిపై దాడికి ఎగబడిన వ్యక్తిని వదిలేసి, ఏ పాపం తెలియని సురేష్‌ను అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. పోలీసులు కూడా అధికార పార్టీకి కొమ్ముకాయడం దురదృష్టకరమని, ఎవరినైనా అరెస్ట్ చేసే ముందు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించాలని హితవుపలికారు.

లే అవుట్ అక్రమాలపై విచారణ చేపట్టాలి..

- ఎమ్మెల్సీ రఘురాజు



ముషిడిపల్లి రెవెన్యూలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ రెవెన్యూ పరిధిలోని లే అవుట్లను ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు లే అవుట్‌లో చోటుచేసుకున్న అక్రమాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్సీ స్పందిస్తూ లే అవుట్ అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు బాసటగా నిలుస్తున్నారన్నారు. లే అవుట్‌కు వేసిన దారిలో డీ పట్టా భూములు, చెరువుల భూములున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లే అవుట్ అక్రమాలపై డీఆర్‌సీలో చర్చించినా అధికారుల్లో చలనం రాలేదన్నారు. ఇరిగేషన్ అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారున. సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించకపోతే రైతుల పక్షాన తానే పోరాటం చేస్తామన్నారు. ఈ విషయమై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ పంచాయితీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల కుదింపు!

- నాటి ఆర్‌బీకేల సేవలకు ప్రభుత్వం మంగళం
- రేషనలైజేషన్ పేరిట తగ్గించేందుకు కుట్ర
- ఇప్పటికే పలు సేవలు అందని వైనం
- తీవ్ర ఆందోళనలో రైతాంగం



భోగాపురం మండలం, అమటాంరాయివలస గ్రామ రైతు సేవా కేంద్రం

పూసపాటిరేగ: రైతు సేవా కేంద్రాల సేవలకు మంగళం పలికేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అధికారంలోకి రాగానే నాటి ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చిన కూటమి సర్కారు..రానురాను వాటిల్లో సేవలు తగ్గిస్తూ వస్తోంది. ఇప్పుడు రేషనలైజేషన్ పేరిట ప్రస్తుతం ఉన్న రైతు సేవా కేంద్రాల సంఖ్యను కుదించేందుకు సన్నాహాలు చేస్తోంది. హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్)లో భాగంగా జిల్లాలోని మొత్తం 510 సేవా కేంద్రాలను తగ్గించనున్నారు. ఏ కేంద్రం పరిధిలో అయితే వెయ్యి ఎకరాల కన్నా తక్కువ ఉంటుందో ఆ కేంద్రాన్ని ఆ పక్క కేంద్రంలో విలీనం చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియ కూడా జరిగినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న రైతాంగం ఆందోళన చెందుతోంది. ఇప్పటికే అరకొరగా సేవలందుతున్నాయని, పూర్తిగా లేకుండా చేస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతమెంతో ఘనకీర్తి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల పనితనం ఎంతో బాగుండేది. సకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందజేసేవారు. ఆఖరికి వారు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు చేసేవారు. ఇవే కాకుండా ఈకేవైసీ, క్రాప్ నమోదులు కూడా సమయానికి చేయడం జరిగేది. దీనికి తోడు ఏడాదికి రూ.13,500 రైతు భరోసా సాయం అందించడంతో రైతులు దర్జాగా వ్యవసాయం చేసుకునేవారు. సాగు సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, అధికారులతో సాగు సలహాలు, సూచనలు ఇప్పించేవారు. వర్షాల సమయంలో పంటలు కాపాడుకోవడం, వరదల బారినపడిన పంట పాడవ్వకుండా చర్యలు చేపట్టించేవారు. అయితే ఇప్పుడు ఆ చర్యలేవీ లేవు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటుతున్నా ఎన్నికల హామీల అమలు ఊసేలేదు. ముఖ్యంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏటా ఇస్తానన్న రూ.20 వేల సాయం కూడా ఇవ్వలేదు. పైగా ఇప్పుడు రైతులకు ఎంతో కొంత అండగా నిలిచే రైతు సేవా కేంద్రాలను ఎత్తివేయాలన్న దుర్మార్గపు ఆలోచనను అన్నదాతలు ఖండిస్తున్నారు.

వెయ్యి ఎకరాలకో కేంద్రం!

ప్రస్తుతం జరిగే రేషనలైజేషన్ ప్రకారం ఏ రైతు సేవా కేంద్రం పరిధిలో అయితే వెయ్యి ఎకరాల సాగు భూమి ఉంటుందో ఆ కేంద్రాన్నే కొనసాగిస్తారు. ఏ కేంద్రం పరిధిలో ఆ భూమి ఉండదో దానికి ఆ పక్క కేంద్రంలో కలిపేస్తారు. అప్పుడు తీసేసిన కేంద్రం పరిధిలోని రైతులంతా సేవల కోసం పొరుగూరు కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయాలపై ఇప్పటికే అంతటా జోరుగా ప్రచారం జరుగుతుండడంతో ఇలా చేస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు సాగు సాయం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశామని అవి రాలేదన్న నిరాశలో ఉండగా రైతు సేవా కేంద్రాలను తీసేస్తారట అనే వార్త కలచివేస్తోందని, కష్టాలు ప్రారంభమైపోయాయని వాపోతున్నారు. ఎక్కడి కేంద్రాలను అక్కడే అలాగే కొనసాగించాలని రైతులు అభ్యర్థిస్తున్నారు.

కేంద్రాలు కొనసాగించాలి..

రైతు సేవా కేంద్రాలు అన్నీ కొనసాగించాలి. వాటి ద్వారా సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ జరుగుతుంది. ఏ ఒక్క కేంద్రాన్నీ మూయవద్దు. రైతులమంతా ఎంతో కొంత ధైర్యంగా ఉన్నామంటే ఈ రైతు సేవా కేంద్రాల ద్వారా ఏమైనా విషయం తెలుస్తుందని, అలాంటిది వాటిని కుదించేస్తామంటే ఎలా ఇబ్బందులు పడిపోతాం.

– పతివాడ భాస్కరరావు, రైతు, పతివాడ గ్రామం

గతంలో సేవలు బాగుండేవి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ రైతు సేవా కేంద్రాల సేవలు ఇప్పటి కన్నా గతంలోనే మెరుగ్గా ఉండేవి. విత్తనాలైనా, ఎరువులైనా పిలిచి మరీ ఇచ్చేవాళ్లు. ప్రస్తుతం కేంద్రాల్లో ఎరువులు కూడా అందుబాటులో ఉండడం లేదు. కనీసం ఖరీఫ్ సాగు నాటికైనా రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

– కె.వెంకటరావు, రైతు, పూసపాటిరేగ

హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష తగదు



ర్యాలీలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్) రోగుల పట్ల వివక్ష చూపవద్దని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి కె.రాణి తెలిపారు. హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కలిస్తూ స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెచ్ఐవీ మహమ్మారి బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రక్తమార్పిడి, సురక్షితం కాని విచ్చలవిడి లైంగిక సంపర్కం, వైరస్ ఉన్న తల్లిపాలు, సిరంజిల ద్వారా వైరస్ సోకుతుందని, ఇది సోకిన వ్యక్తికి 8 నుంచి 10 ఏళ్లలో ఎయిడ్స్ వస్తుందని వివరించారు. హెచ్ఐవీతో బాధపడేవారు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, ఏఆర్‌టీ మందులు తప్పకుండా వాడాలని కోరారు. మందులు వాడుతూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకుంటే జీవితకాలం పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన రామనామస్మరణ



భక్తిగీతాలు ఆలపిస్తున్న భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు

విజయనగరం టౌన్: హనుమాన్ జయంతి వారోత్సవాల్లో భాగంగా నగరంలోని కోట వద్ద రామనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరాముడిని ఆరాధిస్తూ చేసిన గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో భక్తులు చేసిన జైశ్రీరామ్ నినాదాలతో రామనామస్మరణ మార్మోగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం కోట వద్ద నుంచి హనుమాన్ జంక్షన్ వరకు హనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీ చేపట్టారు. మూడు లాంతర్ల జంక్షన్, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, కంటోన్మెంట్, కలెక్టరేట్, మయూరి కూడలి, రైల్వేస్టేషన్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని దైవం పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.

కార్మికులకు నష్టం కలిగేలా లేబర్ కోడ్‌లు



జూట్‌మిల్లు గేటు వద్ద మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ నాయకుడు రామారావు

నెల్లిమర్ల: కార్మిక వర్గానికి నష్టం చేకూర్చేలా కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు ఉన్నాయని స్థానిక జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, కార్మికుల హక్కుల రక్షణే లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన చేయదలచిపెట్టిన దేశవ్యాప్త సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం మిల్లు వద్ద కార్మికులకు సమ్మె వాయిదా పడిన విషయం తెలియజేస్తూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 40 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేసిందని మండిపడ్డారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే చట్టాలు, బిల్లులు చేయడం మానేసి, నష్టం కలిగించే చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ఇప్పటికై నా కార్మిక హక్కులకు భంగం కలిగించే చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1996–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు తీర్మానం చేశారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో..



ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

బొండపల్లి: మండలంలోని గొల్లలపేటలో నెల రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో గుక్కెడు తాగునీరు అందించండి మహాప్రభో అంటూ మహిళలు వేడుకుంటున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ అన్ని వీధులకూ నీరు సరఫరా కావడం లేదు. రామాలయం వీధి కుళాయిల నుంచి నెల రోజులుగా చుక్క నీరు రాకపోవడంతో ఆదివారం వారంతా ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శికి విషయం తెలియజేసినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. ప్రస్తుతమున్న రక్షిత మంచినీటి పథకం నీరు గ్రామం అంతటికీ సరిపోవడం లేదని.. త్వరలోనే మరో బోరు తీసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

గిట్టుబాటు ధర లేక మామిడి రైతుల ఆందోళన



ఎగుమతికి సిద్ధం చేసిన మామిడి కాయలు

బొండపల్లి: మామిడికి గిట్టుబాటు ధర లేక మండలంలోని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఆశించినంత దిగుబడి రానప్పటికీ ధరలు మాత్రం నేల చూపులు చూస్తున్నాయి. సాధారణంగా మే, జూన్ రెండు వారాల్లో ఇతర రాష్ట్రాలకు లారీలు, రైల వ్యాగన్ల ద్వారా ఎగుమతులు జరిగేవి. అయితే ఈ ఏడాది దిగుబడి అంతగా లేకపోవడంతో కోల్‌కతా, ముంబై, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎగుమతులు పెద్దగా లేవు. దీంతో స్థానిక వ్యాపారులకు పంట అమ్మాల్సి వస్తోంది. రెండు వారాలకు ముందు కిలో రూ. 30 పలికిన పండ్లు ప్రస్తుతం 20 రూపాయలు కూడా పలకడం లేదు. మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు.

మండుటెండలో నిరీక్షణ..

- ప్రయాణికులకు తప్పని కష్టాలు
- వేధిస్తున్న బస్సు షెల్టర్ల సమస్య
- గరివిడి పట్టణంలో దారుణ పరిస్థితి
- స్పందించని పాలకులు, అధికారులు



గరివిడి ఆర్ఓబీ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): చీపురుపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు మండుటెండలో రోడ్ల మీద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సులు, ఆటోల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. చంటి పిల్లల దగ్గర నుంచి ముసలివాళ్ల వరకు అందరూ ఎండైనా, వానైనా రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు కూడా నిత్యం అగ్ని పరీక్షే. ప్రయాణికులు ఎండవేడిని తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయిన సందర్భాలు లేకపోలేదు. షెల్టర్ల ఏర్పాటు విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిలువనీడ కరువు..

మండల కేంద్రంగా ఉన్న గరివిడి ప్రధాన పట్టణంలోనే బస్టాండ్ గాని బస్ షెల్టర్లు గాని లేవు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి సినిమా హాల్ జంక్షన్ వద్ద.. ఆర్‌ఓబీకి ఇరువైపులా ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు నిత్యం బస్సులు, జీపులు, ఆటోల కోసం రోడ్ల మీద వేచి ఉంటున్నారు. చీపురుపల్లి వైపు నుంచి విజయనగరం, విశాఖపట్నం వైపు వెళ్లే బస్సులు.. అదే విధంగా రాజాం, పాలకొండ వైపు వెళ్లే బస్సులు కూడా ఇవే ప్రాంతాల్లో ఆగుతుంటాయి. గరివిడి పట్టణంలో నేటికీ బస్టాండ్ లేకపోవడంతో ఎక్కడ వేచి ఉండాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. బస్టాండ్ సౌకర్యం ఉంటే ఈ కష్టాలు ఉండేవి కాదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు సైతం తమ గమ్యస్థానాలకు చేరుకోవడం కోసం ఈ ప్రాంతాల్లో బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. గరివిడిలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకునేందుకు ప్రతిరోజూ విజయనగరం, నెల్లిమర్ల, రాజాం, తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విద్యార్థులు కూడా ఆర్‌ఓబీకి ఇరువైపులా బస్సుల కోసం వేచి ఉంటారు. ఈ ప్రాంతంలో ఎక్కడా బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఈ విధంగా వేర్వేరు ప్రాంతాల్లో బస్సులు కోసం నిరీక్షిస్తుంటారు. మండల కేంద్రంగా ఉన్న గరివిడి పట్టణంలో ఒకచోట బస్టాండ్ సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు ఎండల్లో ఇక్కట్లు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయపురం, అగ్రహారం ఏరియాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో గల మెట్టపల్లి, పీకే పాలవలస, పర్ల కూడలి, అలజంగి జంక్షన్ల వద్ద షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గుర్ల మండలంలో గూడెం జంక్షన్ మినహాయిస్తే ఎక్కడ కూడా బస్‌షెల్టర్ ఆచూకీ అనేది లేదు. మండల హెడ్‌క్వార్టర్ గుర్లలో కూడా షెల్టర్ లేకపోవడం దురదృష్టకరం. అదేవిధంగా అచ్యుతాపురం, గుజ్జింగవలస, పెనుబర్తి, ఎస్ఎస్ఆర్ పేట, జమ్ము, వల్లాపురం, తదితర జంక్షన్ల వద్ద బస్‌షెల్టర్లు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకీ గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుల కోసం బస్టాండ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి..

ప్రైవేట్ వాహనాలు, బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండే కూడలి వద్ద బస్ షెల్టర్లు నిర్మించాలి. ప్రధాన కూడలి వద్ద కూడా బస్‌షెల్టర్లు నిర్మించకపోవడం దారుణం. షెల్టర్లు నిర్మించాలని అధికారులను కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట్ల బస్‌షెల్టర్లు నిర్మించాలి.

– ఎం.సత్యనారాయణ, మెట్టపల్లి

ఎండలో నిరీక్షించాల్సి వస్తోంది..

గరివిడి పట్టణంలో గాని గ్రామీణ ప్రాంతాల కూడలి వద్ద గాని బస్‌షెల్టర్లు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు, ఆటోల కోసం నిరంతరం ఎండల్లోనే నిరీక్షించాల్సి వస్తోంది. మహిళలు, స్కూల్ విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గరివిడిలో బస్టాండ్ గాని కనీసం బస్‌షెల్టర్ గాని లేకపోవడంతో ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నాం.

– ఎం.సురేష్‌కుమార్, విద్యార్థి, గరివిడి పట్టణం

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

దత్తిరాజేరు: మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కోమటిపల్లి కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎంతోమంది యువత మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన అగ్ని ప్రమాద బాధితుడు నిరుజోగి కృష్ణకు గ్రామానికి చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. గత ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు చూడు పశువులు, పశువుల పాక కాలిపోయిన విషయం తెలిసిందే. ఆర్థిక సాయం చేసిన ట్రస్ట్ సభ్యులకు బాధిత కుటంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించేది..?

- ఇబ్బంది పడుతున్న ఇప్పలవలస వినియోగదారులు

మెరకముడిదాం: ప్రభుత్వం ఒక పక్క విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నెత్తిన భారం మోపుతుంటే...మండలంలో విద్యుత్ శాఖాధికారులు బిల్లులు కట్టించుకునేందుకు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇప్పలవలస గ్రామానికి చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను గతంలో తమ గ్రామానికి వచ్చే కలెక్షన్ సిబ్బందికి చెల్లించేవారు. అయితే ఐదు నెలలుగా విద్యుత్ బిల్లులు కట్టించుకునేందుకు సిబ్బంది ఎవ్వరూ గ్రామానికి రాకపోవడంతో వినియోగదారులు ఈ విషయాన్ని సర్పంచ్ బెహరా రమేష్ దృష్టికి ఆదివారం తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ రమేష్ వెంటనే స్పందించి ఏఈ దివాకరరావు ఫోన్ చేసి సమస్య వివరించారు. అయితే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించుకోవాలని ఏఈ సూచించారని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ.. వినియోగదారులందరి వద్ద స్మార్ట్ ఫోన్లు లేవని.. ఒకవేళ ఉన్నా బిల్లులు ఎలా చెల్లించాలో తెలియదని చెప్పారు. ఏఈ చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తెలిపారు. వెంటనే ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కోరారు.